# సంధి

-చావా శివకోటి

'అమ్మాయి వచ్చినట్లుంది' అనుకుంటూ లోనికొచ్చాడు శివయ్య. చేత కూరగాయల సంచి ఉన్నది. ఇల్లాలు శివయ్యను చూసింది. మాట విన్నది.

'మౌనవ్రతాన ఉన్నావా?' ఆగి – కూరగాయల సంచి అక్కడ పెట్టి – ఆమెనే చూస్తూ అడిగాడు.

తలెత్తలేదు. ఉలుకూ పలుకూ లేదు.

శివయ్య కూతురు దగ్గరకు నడచి 'ఎప్పుడొచ్చావురా? ఫోనయినా చేయలేదేం? నేను వద్దును గదా!' అని 'అబ్బాయి ఏడి? రాలేదా?' అన్నాడు.

'ఒక్కదాన్నే వచ్చాను.'

'అతనికి సెలవు దొరకలేదా?'

'నేనే వచ్చాను అని చెపుతున్నాగా' అంది. 'ఇదీ ఆడవాళ్ళకున్న స్వతంత్రం' అనుకొని.

మనుషులను శారీరకంగా బాధించడం కంటే మనస్సుని గాయపరచడం చాలా క్రూరమైంది. కానీ తెలిసో తెలీకో, అనాదిగా పాదున ఉన్న పురుష అహంకారం వల్లో మన దగ్గర ఇది నిత్యకృత్యమైంది.

'మానస' ముఖ కవళికలలో వస్తున్న మార్పును గమనించిన తండ్రి, 'అమ్మా! మీ ఇద్దరినీ ఒక్కటి చేసి పంపాము గనుకా' అన్నాడు నవ్వుతూ.

ఓ క్షణం ఆగి ముందుకొచ్చి 'అబ్బాయి, నువ్వూ మాటా మాటా అనుకున్నారా' అడిగాడు అనునయంగా.

'నేనిక వెళ్ళను నాన్నా. ఇక్కడనుంచే నా నౌకరీకి వెళ్ళాలని ఉంది' అంది. స్థిర చిత్తంతో మాట్లాడినట్లనిపించింది శివయ్యకు. తనలో తానే నవ్వుకొని 'అమ్మడూ! ఒక్క రోజున పడేదే మూడు ముళ్ళ బంధం. సంసారం అలా కాదు. మనం ఉన్నంత వరకూ వదిలేది కాదిది. నీకు తెలియంది కాదు అని – ఇల్లాలి వైపు ఓ అడుగు వేసి– 'పిల్లది వచ్చినట్టుంది' అంటే పలకవైతివి. వచ్చిన తీరు తెల్సుకొనవైతివి. అనునయంగా దాన్ని పలకరించవైతివి – నువ్వు ఉన్న చోట నుంచే ఇవి చేయొచ్చు' అన్నాడు నిష్ఠురంగా.

'రాగానే చూశాను. దాని తీరూ అర్థమైంది. ఇక 'ఇలా రావచ్చా?' అని మాత్రం అడగలేదు. అతనూ, దానికీ మనకూ తెలీనివాడు కాదు గదా! కాకుంటే ప్రతి దానికీ కొంచెం సాగదీసుడు గుణముంది. అన్నీ తెలిసే కదా, అతన్ని కావాలని చేసుకుంది. నాకేమనాలో తెలీలేదు' అంది కూర్చునే.

'అమ్మా! ఇష్టం లేకున్నా – మనస్సు చంపుకొని, అతని అండలోనే ఉండి – 'దొడ్డ ఇల్లాలు' అనిపించుకొనడం నాకు చాతకాదు' – అంది రోషంగా.

సమస్య పెద్దది కానపుడు; దాన్ని పెద్దగా చూసి – నువ్వు కంగారుపడి – మమ్ము చికాకు పెట్టడం మంచిది కాదు. అమ్మా! ఈ లోకాన ఏ ఇద్దరి అభిప్రాయాలు ఒక్కటిగా ఉండవు. ఒక్కమాట! సమాజాన ఎందరు మొగుళ్ళు మారినా. ఇల్లాళ్ళు మారినా – సమస్యలు రాకుండా సంసారాలుండవు. సమస్య అనేదీ భూతం కాదు. మన నడకన పుట్టుకొచ్చేదే! దాన్ని ఎలా పరిష్కరించుకోవాలనేది మన చేతనే ఉంటది' అంది కళ్ళు వత్తుకుంటూ.

'అమ్మా! నువ్వు లక్ష చెప్పు, నన్ను అర్థం చేసుకొనలేని వానితో – ఇక కుదరదు – సర్దుబాటు సంసారాన అవసరం అని నాకు తెలుసమ్మా! కాని దానికీ ఓ పరిధి ఉంటుంది. నేనూ చదువుకున్నదాన్నే. మీ ద్వారా అంతో ఇంతో సంస్కారమూ అబ్బింది. వ్యక్తిత్వం ఉంది. పైగా ఆర్థికంగా అతనిపై ఆధారపడిన దాన్ని కాదు' అని గదిలోకి నడిచింది – తల్లి చూస్తుండి పోయింది.

శివయ్య మాత్రం – మానస వెంట నెమ్మదిగ నడిచాడు. దగ్గరకెళ్ళి భుజాన చెయ్యేసి 'మానసా! నువ్వు ఆవేశాన ఉన్నావు. నీకు కష్టం కలిగేదేదో అక్కడ జరిగింది. కాదనను. మనం మాములు మనుషులం. ఆవేశ కావేషాలు మన్ని వదలవు. కనుక – తొందరపడతాం. నింపాదిగ ఆలోచించుకోవచ్చు. నువ్వు మొదట స్నానం చేసి రా! కాఫీ త్రాగుతూ మాటాడుకుందాం' అన్నాడు.

'నాన్నా! నేనేమిటో మీకు తెలుసు. మీ బిడ్డను. మీరు పెంచారు. కనుక అంతో ఇంతో అర్థమయ్యారు. ఆయన్నెలా అర్థం చేసుకొనడం? బహుశా తప్పు నాదేనేమో?' అంది కళ్ళు వత్తుకుంటూ.

'ఏమిట్రా? నువ్వు బాధపడడం చూడడానికా అంతలా పెంచింది. నువ్వుగా కోరుకున్న వానితోనే గద 'జత' చేసింది. అని ఓ క్షణం ఆగి – కన్నీరు తుడిచి... అమ్మా! వయస్సున నీ కంటే పెద్దవాళ్ళం. అది గొప్ప కాకపోవచ్చు. నీకూ వయస్సు గడుస్తున్న కొద్దీ అర్థమవుతది. ఈ తరానికి మా కంటే తెలివి తేటలెక్కువ. అయినా నాకు తెల్సిన నిజం చెపుతాను. ఈ మగవాడున్నాడే – పెళ్ళికి ముందులా ఆనక ఉండడు. ప్రేమ తరిగిపోయి కాదు. పెళ్ళికి ముందు నువ్వు ప్రియురాలు. ఆ ఆకర్షణ వేరు. నీ దృష్టిన గొప్పగ పడాలనే తాపత్రయం దండిగ ఉంటది. పెళ్ళి జరిగాక ఆకర్షించుకోవాలనే తపన పోతది. ఇద్దరూ కలిసే ఉంటారు గనుక. దగ్గరగ అర్థమవుతారు గనుక. అంటే మీకున్న ప్లస్‌లతో పాటు మైనస్సులూ తెలుస్తయి. ప్రేమ నాటి కలలు – కొంత కరుగుతయి. అలా అని అపేక్ష తగ్గుతుందనుకోకు. కానీ 'ఉపేక్ష' కొంత చేరతది. వాస్తవం ఊహల సంఘర్షణ కొంత ప్రారంభమౌతది – కొందరికి దగా పడినట్టు కూడా అనిపించవచ్చు. కొంత ఆలోచన మీదట – నవ్వూ వస్తది. దగ్గరవ్వాలనే ఉంటది. ఇద్దరూ సర్దుకొని పోతుంటారు.

ఇంకో చిన్న మాటరా! నేనేదో చెపుతున్నాననుకోకు. ఇక్కడ మనిషన్న ప్రతివానికి – పెళ్ళి అవుతది. కాదనుకుంటే తప్పు! గంతకు తగ్గ బొంత దొరుకుతది తేడాలూ వస్తయి. ముడుచుకొంటారు. అలకలుంటయి. కోపాలుంటయి. నవ్వుకుంటారు. కల్సిపోతారు. అరుదుగ విడిపోతారు కూడా! బ్రతుకుబాట తీరిది. ఎందుకంటే – ఇక్కడ ఇద్దరుంటారు. వారికి రెండు స్వభావాలుంటాయి. ఇక నువ్వుగ అనేదేమంటే... రాజీపడి ఉండాల్సిన అవసరం నీకు లేదని – కాదనను – కాదనటానికి నేనెవర్ని? అద్దాల నాటి బిడ్డలు గద్దాలనాడుకాదని తెల్సు. సంసారాలు కుదుట పడడం అంత అవసరమా? అని కూడా అనవచ్చురా! కానీ తల్లీ, సంసారపు అవసరం – ఆవశ్యకతా ఉంది అన్న భావజాలాన బ్రతికినవాళ్ళం. ఆ భావనతోనే మిమ్ము పెంచాం. నువ్వు 'సరే'నన్న తరువాతనే. అతన్ని కనుక్కొని ఇద్దరి ఇష్టప్రకారం ఒక్కటిగ చేశాం' అంటుండగా తల్లి వచ్చి–

'ఇదిగో మానసా! మా ప్రాణంగ సాకాం. చదువులు చెప్పించాం. మంచిగ బ్రతికే అవకాశాన్ని కల్పించాం. ఆర్థికంగా కూడా మా అవసరం 'ఆసరా' లేని స్థితికి చేర్చాం. మీరు కోరుకున్న వారితోనే – పెళ్ళిళ్ళు జరిపాం.. ఇక అన్ని బాధ్యతలూ తీరినవనుకొని నిశ్చింతగ ఉన్నాం. ఇప్పుడు మీరు మీ వ్యక్తిత్వపు అంతరాలకు – ఇలా చేయడం బాగోలేదు' అని దగ్గరకు జరిగి – 'పేదరికాన్ని మీకు తెలీనీలేదు. అది ఎంత భయంకరమైందో మీకు తెలీదు. నువ్వు రోజూ పేపరూ – టీవీ చూస్తావుగద! ఇక నేను చెప్పడానికేముంది. ప్రపంచం మీ ముందుంది. ఇదీ మనముంటున్న సమాజం. ఇదంతా ఎందుకే – మీ ఆఫీసున – నీ 'బాసు' నిన్నూ, నీ వయస్సునూ ఆకలిగ చూడదా? జోకులెయ్యడా? ఏదో నెపంతో తాకే ప్రయత్నం చేయడా? అక్కడేం చేస్తున్నావు? చేస్తున్న నౌకరీని వదిలేసావా? వాణ్ణి చెప్పుతో కొట్టావా? కనీసం కంప్లయింటిచ్చావా? అక్కడ ఓర్చెందుకు?' అని నవ్వి, కుటుంబాన కూడా అలాగే. ఈ భర్త (లోగా నువ్వు కోరుకున్నవాడే కావచ్చు) బాగా లేడనుకుంటే – చేసేదేముంది? వాళ్ళూ అలా అనుకొనవచ్చు గదా! మనకున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు వారికీ ఉన్నాయి గద!' అని ఆగి – ఓ అడుగు దగ్గరికి జరిగి – 'మానసా! అంటే పచ్చిగ ఉంటది గాని, నువ్వు చెప్పు. నీకు కల్గిన మోజు శాశ్వతమా?' అని తాపీగా చూసి– 'చదువరులు మీరు. మనస్సు మనస్సును గమనించండి – దాన్ని అదుపునుంచండి. సమస్యలు రావు' అని– అక్కడే చతికిలపడి కళ్ళు అద్దుకొని– 'అమ్మా! ఆర్థికంగా మీరు ఓకే కాదనను. కాని – మీరు మొదటనే ప్రేమా దోమా అనక పెళ్ళిళ్ళు మానేసి బ్రతికే ప్రయత్నాన పడి ఉంటే – బావుండేది.'

మానస తల్లినే చూస్తున్నది. కళ్ళలో నీరుబికింది.

–అరేయ్! బ్రతుకిది! సంయమనాన తప్ప ప్రశాంతమైన బ్రతుకు మనకు దొరకదు. ఆఖరు మాట తల్లీ, మీ ఇష్టాయిష్టాల కోసం – మా బ్రతుకులలో – వేదనను మిగల్చొద్దు. మేం మీకేది కావాలో, మీరు కోరుకున్న మేర చేసామన్న తృప్తితో బ్రతుకుతున్నాం. అది అబద్ధమో కలో అనిపిస్తే భరించలేమురా' అని లేచి వంటింట్లోకి నడిచింది.

శివయ్య ఇల్లాల్ని చూస్తుండిపోయాడు.

నెమ్మదిగ మానస దాపుకు నడచి – భుజాన చేయుంచి – సముదాయించాడు.

మానస మంచాన కూలబడింది. లేవనూ లేకపోయింది, కూర్చోనూ లేకపోయింది. ఆవిడ ఆలోచన జారుతున్న కన్నీరు నాపలేకపోయింది.

గోడదాకా జరిగి ఆనుకొని – కళ్ళు మూసుకుంది.

కాలానికి మంచీ చెడూ విడివిడిగా ఉండదు. దేన్ని ఆహ్వానించినా మనమే.

❖ ❖ ❖

ఏ జీవికైనా పసితనం అమృతతుల్యమైంది. ఆనందదాయకమైంది.

ఏ బరువు బాధ్యతలూ తెలీని – కోరికలే తెల్సినది. నేను అని తెలిడంతో మరో ప్రపంచాన అడుగిడతాం.

ప్రేమికుడు ఎవరైనా – తనేమిటో అర్థమయ్యాక – మొదట భయంతో తికమక పడడం సహజం. ఆనక – తనకు అందనిదాన్ని, తను లోగా అనుభూతి పొందిన దానితో బేరీజు వేసుకుంటాడు – తెరనున్న వాస్తవాన్ని గమనించ ప్రయత్నిస్తాడు.

ఆ తరువాతనా – అతని మనస్సు నడకను పట్టి ఫలితముంటుంది.

ఏది ఏమైనా–

మనిషిగా – ఈ సమాజాన శ్వాసిస్తున్నాం గనుక – అడుగు పడుతూనే ఉంటుంది. ■